వైఎస్సార్‌సీపీ ప్రభంజనం తథ్యం

- పార్టీలెన్ని కలిసినా ప్రజలంతా జగన్ పక్షమే..
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం


టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధన కోసం ఆవిర్భవించిన వైఎస్సార్‌సీపీ దినదిన ప్రవర్ధమానమై ప్రజల మన్ననలు అందుకుంటోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులతో వైఎస్సార్ సీపీ ప్రభంజనం తథ్యమన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీలను జనం బంగ శాఖాతంలో కలపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 13 ఏళ్లు పూర్తి చేసుకుని 14వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీని స్థాపించారని చెప్పారు. అంతేకాకుండా తెలుగుదేశం పార్టీ నాయకుల అవినీతి, అక్రమాలపై ఉద్యమాలు చేయడంతో పాటు పాదయాత్ర ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకున్నారని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని నెరవేర్చి ఉత్తమ ముఖ్యమంత్రిగా ఖ్యాతినార్జించారని కొనియాడారు. అన్ని వర్గాలకు న్యాయం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

జగన్ వెంటే జనం

ఎల్లో మీడియాలో సత్యదూరమైన రాతలు రాస్తూ వైఎస్సార్ సీపీపై దుష్ప్రచారాలు చేస్తున్నాయని ఎమ్మెల్యే నాగిరెడ్డి ధ్వజమెత్తారు. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కలిసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైకి దూసుకొస్తున్నా అంతిమ విజయం వైఎస్సార్‌సీపీదే అన్నారు. ప్రజా సంక్షేమానికి పాటు పడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెంటే జనం ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, భూపతిరాజు సుజాత, బొడ్డు నర్సింహపాత్రుడు, నాయకులు పల్లా చినతల్లి, బోగాది సన్నీ, ధర్మాల శ్రీను, ఇల్లపు ప్రసాద్, గంధ్రెడ్డి మహాలక్ష్మి నాయుడు, యువశ్రీ, గొందేశి మహేశ్వరరెడ్డి, సంపంగి ఈశ్వరరావు, మంత్రి శంకరనారాయణ, గొందేశి వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనకే ప్రజల మద్దతు

గాజువాక : ప్రజలు మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారని ఆ పార్టీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) అన్నారు. ఈ ఐదేళ్లలో ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి అందించిన పాలనకే ప్రజామద్దతు మెండుగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ 13వ వ్యవస్థాపక దినోత్సవాన్ని గాజువాకలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా ఆయన ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రిగా నెరవేర్చారన్నారు. ప్రజాస్వామ్యంలో ఒక రాజకీయ పార్టీ ఏ విధంగా ఉండాలో, ఎలా పాలన సాగించాలో జగన్ మోహన్‌రెడ్డి చేసి చూపించారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టోను ఇంత పక్కాగా అమలు చేసిన నాయకుడు దేశంలో మరెక్కడా లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండాను ఎగరవేద్దామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, కార్పొరేటర్లు మహ్మద్ ఇమ్రాన్, నాయకులు ఉరుకూటి అప్పారావు, చొప్పా నాగరాజు, రెడ్డి జగన్నాథం, పేరం రామకృష్ణారెడ్డి, సింగంపల్లి దేముడు, షౌకత్ అలీ, వేణుబాబు, మార్పు శేషు, పాలఘాట్ కృష్ణ, ఎలమంచిలి అప్పారావు, కర్రి ప్రసాద్, సంగ్రాన నూకరాజు, బొత్స వాసు, నీలాతి అచ్చిబాబు, బాబులు నాయుడు, రంగాల పైడిరాజు, బలిరెడ్డి పెంటారావు, జీఎస్ఎన్ రాజు, కుప్పిలి సత్యనారాయణ, కటికల కల్పన, కాకి నిర్మలారెడ్డి, ఉమాదేవి, విమల థామస్, గొంతిన సత్యవతి తదితరులు పాల్గొన్నారు.


గాజువాకలో వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉరుకూటి చందు తదితరులు

స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఉక్కునగరంలో ఘనంగా నిర్వహించారు. సెక్టార్-1 యూనియన్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో నాయకులు పార్టీ జెండా ఎగరవేశారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వంపై కొన్ని దుష్టశక్తులు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతీ నాయకునికి, కార్యకర్తకు ఉందన్నారు. కార్యక్రమంలో కర్రి దాలినాయుడు, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, డి.సంపూర్ణం, బి.రామకృష్ణ, ఎస్.భీమరాజు, డి.పుల్లారావు, మహాలక్ష్మి నాయుడు, మురళి, పి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

87వ వార్డులో..

కూర్మన్నపాలెం: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జీవీఎంసీ 87వ వార్డులో పార్టీ సీనియర్ నాయకుడు ప్రగడ వేణుబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కణితి గాంధీ బొమ్మ సెంటర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మార్పు శేషు, ముద్దపు మురళీమోహన్, బొండా గోవిందరాజులు, హరీష్, చిన్న, స్థానిక మహిళలు పాల్గొన్నారు.


87వ వార్డులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు


ఉక్కునగరం వైఎస్సార్‌టీయూసీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న నాయకులు


పార్టీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న చింతలపూడి

చింతలపూడి ఆధ్వర్యంలో..

గాజువాక: వైఎస్సార్‌సీపీ 13వ వార్షికోత్సవాన్ని మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. స్థానిక నాయకులు సియ్యాద్రి తాతారావు, కోటి, పోలీస్ నాయుడు, చందు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన షిర్డీసాయి శాంతిధామం వార్షికోత్సవాలు


పండ్లు, 108 రకాల మిఠాయిలతో బాబాకు మహా నైవేద్యం

పెదగంట్యాడ: సమతానగర్‌లోని షిర్డీ సాయి శాంతిధామం 10వ వార్షికోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సాయినాథుడికి 108 కలశాలతో మహా కుంభాభిషేకం చేశారు. బాబాను పల్లకీలో ఉంచి, వీధుల్లో ఊరేగించారు. పండ్లు, 108 రకాల మిఠాయిల తో మహా నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం కోలాటం, పరస నిర్వహించారు. బాబాను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు, కార్పొరేటర్లు స్టాలిన్, పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు దర్శించుకున్నారు.ఆలయ కమిటీ చైర్మన్ నక్క లక్ష్మణరావు, వైస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, కోశాధికారి సత్యనారాయణ, సాయిసేవకులు పాల్గొన్నారు.

ఫార్మా నిర్వాసితుల మేజర్ సన్స్‌కు పట్టాలివ్వాలి


కలెక్టర్‌కు ఎమ్మెల్యే నాగిరెడ్డి ద్వారా వినతి పత్రం అందిస్తున్న నిర్వాసితులు

అగనంపూడి: ఫార్మాసిటీ నిర్వాసితుల్లో 2010 నాటికి వివాహిత కుమారులను గుర్తించి పట్టాలివ్వాలని కలెక్టర్ మల్లికార్జునను కోరారు. వైఎస్సార్‌సీపీ గాజువాక జేసీఎస్-2 కన్వీనర్ ఇల్లపు ప్రసాద్, నిర్వాసిత సంఘం నాయ కుడు ఇల్లపు వాసు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ద్వారా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. 2010 నాటికి వివాహిత కుమారులను గుర్తించి, వారికి న్యాయం జరిగేలా చూడాలని కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

చికిత్సతో క్షయ వ్యాధి నివారణ


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, టీబీ యూనిట్ సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: సరైన చికిత్స ద్వారా క్షయ వ్యాధిని నివారించవచ్చని అగనంపూడి టీబీ యూనిట్ వైద్యుడు ఎస్‌టీఎస్ అనిల్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని అగనంపూడి టీబీ యూనిట్ ఆధ్వర్యంలో 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌వీ రాణి, సిబ్బంది భూలక్ష్మి, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

'అగనంపూడి టోల్‌గేట్ తొలగించాలి'

అగనంపూడి: అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిని జాతికి అంకితం చేసిన ప్రధాని అగనంపూడి టోల్‌గేటును ఎప్పుడు తొలగిస్తారో ప్రకటించాలని ప్రజా సంఘాల సమావేశం డిమాండ్ చేసింది. అగనంపూడిలో నిర్వహించిన సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు పట్టా రామ అప్పారావు, నిమ్మకూరి రమేష్ మాట్లాడుతూ అనకాపల్లి ఆనందపురం జాతీయ రహదారి విస్తరణ పూర్తి చేసిన వెంటనే అగనంపూడి టోల్‌ప్లాజాను తొలగిస్తామని అప్పట్లో కేంద్ర పాలకులు హామీ ఇచ్చారని, న్యాయస్థానానికి కూడా లిఖితపూర్వకంగా అధికారులు తెలియజేశారన్నారు. ఆ రహదారిని జాతికి అంకితం చేసిన అధికారులు, పాలకులకు తొలగింపు విషయం గుర్తు రాకపోవడం దారుణమన్నారు. వెంటనే టోల్‌ప్లాజాను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో దానబాల త్రిమూర్తులు, కాసా పద్మరాజు పాల్గొన్నారు.

రూ.6.39 కోట్లతో రహదారుల అభివృద్ధి

- సిద్ధేశ్వరం డబుల్ రోడ్డు, బీసీ రోడ్ల ప్రారంభోత్సవం నేడు
- ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు బొత్స, అమర్‌నాథ్ రాక


విద్యుత్ వెలుగుల్లో సిద్ధేశ్వరం డబుల్ రోడ్డు


సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి


కొత్తగా నిర్మించిన బీసీ రోడ్డు

పెదగంట్యాడ: వైఎస్సార్‌సీపీ పాలనతో మండలంలో అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అందులో భాగంగా సుమారు రూ.6.39 కోట్లతో అభివృద్ధి చేసిన రెండు రహదారుల ప్రారంభోత్సవం బుధవారం అతిరథ మహారథుల చేతుల మీదుగా ప్రారంభం కానున్నాయి. సిద్ధేశ్వరం డబుల్ రోడ్డు, బీసీ రోడ్లతో పాటు నూతనంగా నిర్మించిన దయాల్‌నగర్ యూపీహెచ్‌సీని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించనున్నారు. ఈ మేరకు 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. 8వేల మందికి భోజనాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

మెరుస్తున్న సిద్ధేశ్వరం డబుల్ రోడ్డు

సిద్ధేశ్వరం డబుల్ రోడ్డును కనీవినీ ఎరుగని రీతిలో 4కోట్ల 40లక్షల రూపాయలతో అభివృద్ధి చేశారు. 40 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా రోడ్డును నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. రోడ్డు మధ్యలో డివైడర్‌తో పాటు ఇరువైపులా ఫుట్‌పాత్ నిర్మించారు. రోడ్డు మధ్య ఆధునిక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.

బీసీ రోడ్డుకు మహర్దశ : బాలచెరువు (బీసీ) రోడ్డుకు మహర్దశ పట్టింది. కాకతీయ ఐటీఐ కూడలి నుంచి గంగవరం పోర్టు వంతెన వరకు ఒక కోటీ 99 లక్షల తొంబై రెండు వేల రూపాయలతో బీటీ రోడ్డు నిర్మించారు. ఈ మార్గంలో అటు స్టీల్‌ప్లాంట్, ఇటు గంగవరం పోర్టుతో పాటు ఆటోనగర్‌లోని పలు పరిశ్రమల్లో పని చేసే వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో ఈ రోడ్డు గతుకులతో ఉండడంతో వాహనచోదకులు ఇబ్బంది పడేవారు. పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణానికి స్టీల్‌ప్లాంట్ అధికారులు ససేమిరా అనడంతో ఎమ్మెల్యే నాగిరెడ్డి చొరవ తీసుకుని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు సమస్య వివరించారు. స్పందించిన ఆయన రోడ్డును పరిశీలించి, వెంటనే నిధులు మంజూరు చేయడంతో రోడ్డు నిర్మాణానికి జనవరి 31న మేయర్ హరివెంకట కుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి శ్రీకారం చుట్టారు. టెండర్లు పిలిచి, చకచకా నిర్మాణం పూర్తి చేయడంతో మంగళవారం ప్రారంభానికి సిద్ధమైంది.

రూ.1.14 కోట్లతో యూపీహెచ్‌సీ

జీవీఎంసీ 74వ వార్డు సిద్ధేశ్వరం (దయాల్‌నగర్)లో కొత్తగా కోటి 14 లక్షల రూపాయలతో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని (యూపీహెచ్‌సీ) నిర్మించారు. ఈ భవనంలో మొత్తం 10 గదులను నిర్మించారు. ఈ కేంద్రంలో మొత్తం 63రకాల పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన పరికరాలను సిద్ధం చేశారు. ప్రారంభానికి సిద్ధమైన ఈ కేంద్రాన్ని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి మంగళవారం పరిశీలించారు.


కొత్తగా నిర్మించిన యూపీహెచ్‌సీ

జగ్గు జంక్షన్ విస్తరణ పనులకు శంకుస్థాపన

రూ.5.67 కోట్లతో చేపట్టనున్న పనులు

గాజువాక : కోట్ల రూపాయల వ్యయంతో నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో సమగ్రాభివృద్ధి సాధించామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 72వ వార్డులో రూ.5.67 కోట్లతో చేపట్టనున్న జగ్గు జంక్షన్ విస్తరణ, వందడుగుల రోడ్ ఆధునికీకరణ, విద్యానగర్ కల్వర్టు నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవసరమున్న ప్రతిచోటా రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులను ఏర్పాటు చేశామని, పార్కులను అభివృద్ధి చేశామని చెప్పారు. గాజువాక నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, స్థానిక నాయకులు బోగేష్, వి.బలరామ్, సాలాపు రామారావు, బి.సత్యనారాయణ, నీలకంఠం, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.


జగ్గు జంక్షన్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

71వ వార్డులో సీసీ రోడ్డు పనులకు..

71వ వార్డు తోకాడలో నిర్మించనున్న సీసీ రోడ్, కల్వర్టు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.18 లక్షలతో ఈ పనులను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ రాజాన రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రసాద్, రామరాజు, కిశోర్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ సభను విజయవంతం చేయాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఈ నెల 15న నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద మంగళవారం నిర్వహించిన పోరాట కమిటీ సమావేశంలో నాయకులు మాట్లాడారు. ప్లాంట్ పరిరక్షణ కోసం మూడేళ్ల నుంచి కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తున్నామని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా ముందుకు వచ్చిందని అన్నారు. ఇందులో భాగంగా త్రిష్నా మైదానంలో ఆ రోజు సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న సభకు తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిల హాజరవుతున్నందున ఉక్కు ఉద్యోగులు, నిర్వాసితులు తమ కుటుంబ సభ్యులతో సభకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, వై.మస్తానప్ప, జి.గణపతిరెడ్డి, జెర్రిపోతుల ముత్యాలు, డి.వి.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న పోరాట కమిటీ నాయకులు

స్టీల్‌ప్లాంట్ సీఎల్‌సీ అధికారులకు సత్కారం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ సెల్ (సీఎల్‌సీ) అధికారులను విశాఖ ఉక్కు శ్రామిక సంఘం నాయకులు సత్కరించారు. ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ (ఈఎస్ఎఫ్) విభాగంలో కాంట్రాక్ట్ చేస్తున్న జె.ఆర్.కన్‌స్ట్రక్షన్ యజమాని మరణించడంతో ఆ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు రెండున్నరేళ్ల పాటు ఫుల్ అండ్ ఫైనల్ బెనిఫిట్స్ నిలిచిపోయాయి. కార్మికులకు రావాల్సిన ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్‌మెంట్ కోసం సీఎల్‌సీ డీజీఎం ఖర్, ఈఎస్ఎఫ్ డీజీఎం కె.శ్రీనివాసరావు, హెచ్‌ఆర్ డీజీఎం అరుణ, సీఎల్‌సీ సిబ్బంది సూర్యనారాయణ శ్రమించి ఉక్కు యాజమాన్యమే ఇచ్చేలా కృషి చేశారు. ఈ సందర్భంగా ఖర్, సూర్యనారాయణతో పాటు సీఎల్‌సీ సిబ్బందికి మంగళవారం వారు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొడ్డు పైడిరాజు, కరణం సత్యారావు, ఎం.కోటేశ్వరరెడ్డి, బొడ్డు రమణ, పి.పెంటారావు, కె.వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సీఎల్‌సీ అధికారులను సత్కరిస్తున్న నాయకులు

యాత, శెట్టిబలిజ, గౌడ కులాలను గుర్తించాలి

గాజువాక : రానున్న ఎన్నికల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో తమ కులాలను రాజకీయ పార్టీలు గుర్తించాలని యాత, శెట్టిబలిజ, గౌడ సంఘాల నాయకుడు నెల్లి అప్పలరాజు కోరారు. గాజువాకలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రానున్న ఎన్నికల్లో తమ సామాజికవర్గాన్ని గుర్తించిన పార్టీలకు తమ మద్దతు ఉంటుందన్నారు. గాజువాకలో తాము మూడో స్థానంలో ఉన్నామన్నారు. తమ ఓట్ల మద్దతుతో గెలిచే ఏ ఎమ్మెల్యే అయినా తమ సామాజికవర్గానికి చెందిన వారికి కార్పొరేషన్ ఎన్నికల్లో గాని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరువాత నామినేటెడ్ పోస్టుల్లో గాని ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సమావేశంలో నాయకులు పోలవరపు రమణబాబు, నెల్లి సాధురావు, పితాని భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ భవనం ప్రారంభం

కూర్మన్నపాలెం: దివ్యాంగ చిన్నారులకు అవసరమైన వసతులు కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున కోరారు. అభయ ఫౌండేషన్-హైదరాబాద్, స్పందన చేయూత ఫౌండేషన్ సౌజన్యంతో వడ్లపూడి భవిత కేంద్రంలో అధునాతన సౌకర్యాలతో ఏర్పాటు చేసిన హైడ్రోథెరపీ, సాండ్ థెరపీలతో కూడిన ఫిజియోథెరపీ నూతన భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిత కేంద్రాలకు విచ్చేస్తున్న చిన్నారులకు ఫిజియోథెరపీ కోసం ఏర్పాటు చేసిన భవనాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. దివ్యాంగ చిన్నారుల శారీరక, మానసిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భవిత కేంద్రాలకు ప్రభుత్వం భరోసా కల్పించనుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సమగ్రశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యం, అభయ ఫౌండేషన్, స్పందన చేయూత ఫౌండేషన్ సభ్యులు ఇ.బుచ్చిబాబు, కె.రవి, సీతారామరాజు, అడ్వైజర్ ఎ.ఎస్.ఎస్.మూర్తి, సమగ్ర శిక్ష అభియాన్ ఐఈ కన్సల్టెంట్ నరసింహం, జిల్లా ఐఈ కో-ఆర్డినేటర్ బి.గీత, ఇతర సెక్టోరియల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.


ఫిజియోథెరపీ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

బయోమెట్రిక్ అటెండెన్స్ అమలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో మార్చి 8 నుంచి డార్స్ అటెండెన్స్ పద్ధతి తొలగించి, బయోమెట్రిక్ అటెండెన్స్ (బార్స్) కొనసాగిస్తున్నారని స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం కె.సంజీవరావు తెలిపారు. హెచ్‌ఆర్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం మధ్యాహ్నం నిర్వహించిన బయోమెట్రిక్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అయితే కార్మిక సంఘాల విజ్ఞప్తి మేరకు బార్స్‌తో పాటు డార్స్ షీట్లు కూడా కొనసాగిస్తున్నామని చెప్పారు. డార్స్ షీట్లపై సంతకాలు చేసిన వారి హాజరు బార్స్ ద్వారా నమోదు చేస్తున్నారన్నారు. ఈ పద్ధతి ఎంత కాలం ఉంటుందనేది చెప్పలేమన్నారు. అందువల్ల ప్రతీ కార్మికుడు బార్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో పాటు హాజరు కూడా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు లేవనెత్తిన అనేక సందేహాలు, సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకు వెళతామని తెలిపారు. తదుపరి సమావేశాన్ని మార్చి 16కు వాయిదా వేశారు. జీఎం లలన్ కుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో హెచ్‌ఆర్ అధికారులు ఎస్.కె.ఖర్, వై.హెచ్.శంకర్, ఐటి డీజీఎం ఎన్.ప్రభాకర్ రామ్, 22 మంది కార్మిక నాయకులు పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన భద్రతతో ప్రమాదాల నివారణ

అగనంపూడి: పరిశ్రమల యాజమాన్యాలు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవడం ద్వారా ప్రమాదాల నివారణకు అవకాశం ఉంటుందని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేష్ అన్నారు. జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా దువ్వాడ వీఎస్ఈజెడ్ ఆవరణలోని సినర్జీస్ కంపెనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల పెద్ద ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భాలే ఎక్కువగా ఉంటాయని, నిర్లక్ష్యం వహిస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. భద్రత విషయంలో యాజమాన్యాలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం కార్మికులు భద్రతా ప్రమాణం చేశారు. తరువాత వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.సుధాకర్, సినర్జీస్ జీఎం రమేష్‌బాబు, జీఎం చంచల్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేష్



తక్కువ ఎత్తులో ఉన్న వైర్లను పైకి కడుతున్న ఈపీడీసీఎల్ సిబ్బంది

హై'టెన్షన్' నుంచి విముక్తి

పెదగంట్యాడ: ఏపీఈపీడీసీఎల్ అధికారులు స్పందించారు. హై'టెన్షన్' నుంచి విముక్తి కల్పించారు. 77వ వార్డులో పరదేశమ్మ ఆలయం మీద నుంచి జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీ వరకూ నాలుగు రోడ్ల జంక్షన్‌లో 11కేవీ, 33కేవీ, ఎల్‌టీ 5 లైన్ల కోసం ఏర్పాటు చేసిన వైర్లు కిందకు వేలాడుతుండడంతో ప్రజలు హడలిపోయేవారు. భారీ వాహనాల రాకపోకల సమయంలో తెగిపోతుండటం, గాలి వీచినప్పుడు వైర్లు ఒకదానికొకటి తగిలి నిప్పులు రాలడంతో రాకపోకలు సాగించేందుకు భయపడేవారు. ఈ నేపథ్యంలో 'నిత్యం హై'టెన్షన్' శీర్షికన సాక్షి దినపత్రికలో ఈ నెల 11న ప్రచురితమైన కథనానికి ఈపీడీసీఎల్ ఏఈ రవి తేజస్వి స్పందించారు. వెంటనే వైర్ల ఎత్తు పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. లైన్‌మెన్ మధు, సిబ్బందితో కలసి మంగళవారం వైర్ల ఎత్తు పెంచారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

1125వ రోజుకు ఉక్కు దీక్షలు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1125వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్రమోదీ స్పందించి, విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.